క్లుప్తంగా

ఒకటో జూనియర్ సివిల్ జడ్జిగా సాహితి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరించిన సాహితి

కాకినాడ లీగల్: కాకినాడ ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా వి.సాహితి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె విశాఖపట్నంలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూ 2021లో జూనియర్ సివిల్ జడ్జి పరీక్షలో ఎంపికయ్యారు. ఆమెకు ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా తొలి పోస్టింగ్ కాకినాడలో నియమించారు.

మానవత్వం సేవాసంస్థ కొత్త కార్యవర్గం

కరప: మండలం గురజనాపల్లిలో బుధవారం మానవత్వం ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పబ్బినీడి వెంకటకృష్ణ, అధ్యక్షుడిగా చక్కపల్లి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ తుమ్మలపల్లి శివరామకృష్ణ, కోశాధికారిగా జొన్నలగడ్డ వెంకటసుధ, ఉపాధ్యక్షులుగా పెంటగట్ల మణికుమార్, వెలవలపల్లి కామేశ్వరశర్మ, జాయింట్ సెక్రటరీలుగా కూరపాటి శాంతి, గౌరుసు బాలాత్రిపుర సుందరి, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మాజీ సర్పంచ్ బొడ్డు సత్యప్రసన్న, బావిశెట్టి సతీష్, కార్యవర్గ సభ్యులుగా పోలినాటి సుధాకర్, సత్యంశెట్టి ఈశ్వరరావు, మాగాపు వెంకన్న, మాగాపు మరిడియ్య, పెంటపాటి సత్తిబాబు, ముడుగు విజయ్‌కుమార్, పెంకే లోవరాజులు ఎన్నికయ్యారు. ఎవరికి ఏ అవసరం వచ్చినా తమవంతు బాధ్యతగా బాధితులకు అండగా నిలుస్తామని కొత్తకార్యవర్గం పేర్కొంది.

గ్యాస్ ధరల పెంపు ఉపసంహరించుకోవాలి

బోట్‌క్లబ్: కేంద్ర ప్రభుత్వం గృహ వినియోగానికి ఉపయోగించే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.50, వాణిజ్య సిలెండర్ ధూ. 350 పెంచడాన్ని ఖండిస్తున్నట్టు సీపీఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాణిజ్య సిలిండర్ ధర రూ.350 పెంచడం దారుణమన్నారు. ఇప్పటికే గ్యాస్ ధరలు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్ ధరలు రెండు నెలలు వ్యవధిలో రెండు సార్లు పెంచడం బాధాకరమన్నారు. మూడేళ్ల క్రితం రూ.417 ఉన్న సిలిండర్ ధర ప్రస్తుతం రూ.1155కు పెరిగిందన్నారు. గృహ వినియోగదారులకు సబ్సిడీ కింద ఇచ్చే సిలిండర్లను కూడా కుదించారన్నారు. ఇది పూర్తిగా పేద, మధ్య తరగతి ప్రజలపై భారమే అన్నారు. మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు రాయితీలిచ్చి దేశాన్ని దోచిపెడుతున్నారన్నారు.

చరిత్రలో పెను మార్పులకు ప్లీనరీ నాంది

కాకినాడ: రాయపూర్ వేదికగా ఇటీవల జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సమావేశం దేశ చరిత్రలో మైలు రాయి అని, పెనుమార్పులకు ఒక సంకేతమని ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి రాంబాబు పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగిన సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి నులుకుర్తి వెంకటేశ్వరరావుతో కలిసి మాట్లాడుతూ ప్లీనరీలో కాంగ్రెస్ అగ్రనేతలు తీసుకున్న నిర్ణయాలు ప్రజా రంజకమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలకు కాంగ్రెస్ కట్టుబడి ఉందన్నారు. సమావేశంలో పీసీసీ సభ్యులు ఆకుల వెంకటరమణ, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీరాజు, మాజీ కౌన్సిలర్ కంభం రాజబాబు తదితరులు పాల్గొన్నారు. ఏఐసీసీ సభ్యుడిగా నియమితులైన మల్లిపూడి శ్రీరామ చంద్రమూర్తి (రాంబాబు)ని నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు.

నేడు నీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ: కాకినాడ నాలుగో డివిజన్ భాస్కర్‌నగర్ సాయిబాబా ఆలయం సమీపంలో తాగు నీటి పైపులైన్ మరమ్మతుల దృష్ట్యా గురువారం పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ ఎస్ఈ సత్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. భాస్కర్‌నగర్ రిజర్వాయర్ పరిధిలో సాయంత్రం నీటి సరఫరాను పూర్తిగా నిలిపివేస్తామన్నారు. ఈ కారణంగా 3 నుంచి 9వ డివిజన్ వరకు ఉన్న ఆయా ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు తాగు నీటిని నిల్వ చేసుకోవాలని కోరారు. అత్యవసరం అయితే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాను అందిస్తామన్నారు.

టీడీపీ నాయకుల ప్రచారం

కరప: మండలం పెనగుదురులో బుధవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీనాయకులు, కార్యకర్తలతో కల్సి ఇంటింటికీ మీ అనంతలక్ష్మి, ఇదేం కర్మ మన రాష్ట్రానికి నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచారు. టీడీపీ రాష్ట్రకార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పులపకూర శుభామహేష్, పార్టీనాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

సామర్లకోట: పెద్దాపురం మండలం వడ్లమూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఇన్‌చార్జి ఎంపీడీఓ కరక హిమ మహేశ్వరి బుధవారం తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల సంఖ్య, కేంద్రంలోని సదుపాయాలు, కేంద్రానికి వస్తున్న పౌష్టికాహార వివరాల రికార్డులను పరిశీలించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కంటే వీర్రాఘవరావు పాల్గొన్నారు.

పొద్దెక్కే సరికే పింఛను కానుక

- వెలకట్టలేని జగనన్న ఔదార్యం
- అవ్వాతాతల కళ్లల్లో ఆనందం
- 87శాతం పూర్తయిన పంపిణీ


ప్రభుత్వాస్పత్రిలో ఉన్న అప్పయ్యమ్మకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ గాది దుర్గ


వలసపాకలలో గన్నియ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చాట్ర రాణి


కరపలో ముత్యాలమ్మకు పింఛన్ ఇస్తున్న వలంటీర్ నక్కా దుర్గాప్రసాద్


కరపలో చిన్నారి త్రివికకు పింఛను ఇస్తున్న వలంటీర్ సుధీర్‌చైతన్య

కాకినాడ: ఒకటో తేదీ... పింఛన్‌దారులు వేయి కళ్లతో ఎదురుచూసే రోజు. 'జగన్‌బాబు' పంపిన ఆ పింఛన్ కానుక ఎప్పటిలాగే.. తలుపుతట్టి మరీ వలంటీర్ అందించడంతో అవ్వాతాతలు సహా వివిధ రకాల పింఛన్ లబ్ధిదారులలో సంతోషం వెల్లివిరిసింది. ఆ పింఛనే ఆధారంగా బతికే ఎంతో మంది కళ్లల్లో ఆనందం కనిపించింది. నగరపాలక సంస్థ పరిధిలో 29,734 మందికి బుధవారం పింఛన్ల పంపిణీ జరగాల్సివుంది. వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులతో పాటు డయాలసిస్, కిడ్నీ రోగులు వెరసి సుమారు 14 రకాల పింఛన్లను తెలవారకే ముందే వలంటీర్లు, గృహసారథుల సహకారంతో పంపిణీ చేపట్టారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రులలో ఉన్న, దగ్గరలోని బంధువుల ఇళ్లల్లో ఉన్నా.. మరే సమస్యలలో ఉన్నా.. వారు ఉన్న ప్రాంతాలకే వెళ్లి వలంటీర్లు తమ బాధ్యతను నిర్వర్తించి అవ్వతాతల కళ్లల్లో సంతోషాన్ని నింపారు. ఒకప్పుడు పింఛన్ కోసం గంటల తరబడి, రోజుల తరబడి కూడా పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు పడే పరిస్థితి నుంచి తెలవారకముందే తలుపుతట్టి మరీ పింఛన్ ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పింఛన్‌దారులంతా కృతజ్ఞతలు చెబుతున్నారు. కాకినాడలో నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పర్యవేక్షణలో, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు.

కరపలో 77.85 శాతం పంపిణీ

కరప: మండల పరిధిలోని 23 గ్రామాల్లో 11,397 మందికి వివిధ రకాల పింఛన్లు ఇవ్వాల్సి ఉండగా మొదటిరోజు బుధవారం 8,873 మందికి (777.85 శాతం) పంపిణీ చేసినట్టు ఎంపీడీఓ కర్రె స్వప్న తెలిపారు. అన్ని రకాల పింఛన్ల సొమ్ము రూ.3,11,02,250 లు లబ్ధిదారులకు బట్వాడా చేయాల్సి ఉండగా రూ 2,41,99,750 ఇచ్చినట్టు తెలిపారు. గ్రామాల్లో కొందరు లబ్ధిదారులు లేక, సిగ్నల్స్ లేక సర్వర్ స్లోగా పనిచేయడం, అనారోగ్య కారణాలతో మరి కొందరు అందుబాటులో లేకపోవడం నూరుశాతం పంపిణీ జరగలేదని ఎంపీడీఓ తెలిపారు. గురు, శుక్రవారాల్లో నూరుశాతం పూర్తి చేయిస్తామని ఆమె చెప్పారు. ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శులు పింఛన్ల పంపిణీని పర్యవేక్షించారు. పెనుగుదురు-2 గ్రామసచివాలయంలో 91.07శాతం, గురజనాపల్లి 87.91 శాతం, గొర్రిపూడి-1 87.86శాతం, యండమూరు 86.22 శాతంతో పింఛన్ల పంపిణీలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచాయి. మండల పరిధిలో ఉదయం 5 గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించగా, అధికారులు, కార్యదర్శులు, గ్రామ వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయడంపై లబ్ధిదారులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

ఫిర్యాదు చేసిన ఏడేళ్లకు విచారణ!

- రిజిస్ట్రేషన్ల శాఖలో అవకతవకలపై 2015లో ఫిర్యాదు
- విచారణకు రావాలని న్యాయవాదికి బుధవారం నోటీసు

కాకినాడ లీగల్: రిజిస్ట్రేషన్‌శాఖలో అవకతవకలపై న్యాయవాది ఫిర్యాదు చేసిన ఏడేళ్ల తరువాత జిల్లా రిజిస్ట్రార్ పి.రామలక్ష్మి పట్నాయక్ విచారణ నిర్వహించారు. కాకినాడ చెందిన పీఆర్ కాంత్ బ్యాంక్ పానల్ న్యాయవాది. ఒకరికి బ్యాంకు రుణం కోసం దస్తావేజులను న్యాయవాదికి చూపించారు. దస్తావేజు నెం.491/1967లో సర్వే నెంబర్ 16/1ఎగా ఉంది. ఆ దస్తావేజు నకలు కోసం న్యాయవాది సోమర్లకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో 2015లో దరఖాస్తు చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఉద్యోగులు ఇచ్చిన దస్తావేజు నకలులో సర్వే నెంబర్ 6/1ఎగా ఉంది. అయితే నంబర్లు తేడా ఉండడంతో న్యాయవాది సబ్ రిజిస్ట్రార్ దృష్టికి తీసుకువెళ్లారు. సబ్ రిజిస్ట్రార్ పుస్తకాన్ని పరిశీలించగా 1 అనే సంఖ్య తొలగించి ఉంది. దీనిపై 2015 ఆగస్టు ఒకటిన అప్పటి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీవజీ సాయిప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. అయితే ఏడేళ్ల తరువాత విచారణకు పిలవడంతో న్యాయవాది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇటీవల రిజిస్ట్రేషన్‌శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదు, అవకతవకల, వివిధ అంశాలపై ఫిర్యాదులు వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని వచ్చిందని రిజిస్ట్రేషన్ ఉద్యోగులు చెపుతున్నారు.

గాలికుంటు నివారణే లక్ష్యం

- ఈ నెల 31 వరకు టీకాల పంపిణీ
- విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఇలక్కియ పిలుపు


గాలికుంటు వ్యాధి టీకాల పంపిణీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేసీ ఇలక్కియ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం ద్వారా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేయిస్తున్నట్టు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. మార్చి 1 నుంచి 31 వరకూ జరిగే గాలికుంటు వ్యాధి టీకా పంపిణీని విజయవంతం చేయాలని కోరారు. కాకినాడలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. జిల్లాలో ఉన్న 2.90 లక్షల పశువులకు టీకాలు వేయించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2019లో ఈ కార్యక్రమం ప్రారంభించిందని, 2025 నాటికి ఈ వ్యాధి నియంత్రించాలన్న ప్రణాళికతో పనిచేస్తోందన్నారు. గ్రామ స్థాయిలో నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకా వేయించాలన్నారు. జేడీ ఎస్.సూర్యప్రకాశరావు మాట్లాడుతూ గాలికుంటు వ్యాధిని కాలికుంటు వ్యాధి, గాలిగాళ్ల వ్యాధి, నోటిగాళ్ల వ్యాధి ఇలా వివిధ పేర్లతో పిలుస్తారన్నారు. ఈ వ్యాధి వల్ల పశువులు మరణించకున్నా రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందన్నారు. ఒక పశువు నుంచి మరొక పశువుకు ఈ వ్యాధి సోకుతుందన్నారు. 2030 నాటికి ఈ వ్యాధి దేశంలోనే లేకుండా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం గాలికుంటు వ్యాధిపై పాడి రైతులకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన పోస్టర్‌ను జేసీ ఇలక్కియా, జేడీ ఆవిష్కరించారు. పశుసంవర్ధకశాఖ డీడీలు పాల్గొన్నారు.

ఆదివారమూ చెత్త సేకరించాలి

- లేకుంటే సిబ్బంది నుంచి సొమ్ము రికవరీ
- నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహారావు


చెత్తసేకరణపై స్థానికుడితో మాట్లాడుతున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: స్థానిక వెంకటేశ్వర కాలనీ ప్రాంతంలో పారిశుధ్య పనులను బుధవారం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పరిశీలించారు. స్థానికులు ఆయనతో మాట్లాడుతూ ఆదివారం చెత్త సేకరణకు వాహనాలు రావడంలేదని ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన చెత్త సేకరణ ఏజెన్సీకి ఆదివారం కూడా సొమ్ము చెల్లిస్తున్నామని, వారు రాకుంటే సొమ్మును శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శుల నుంచి రికవరీ చేస్తామని పేర్కొన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చొరవ తీసుకుని నిర్వాహకులతో మాట్లాడాలని, సేవలు మెరుగుపరచాలని ఆదేశించారు. డ్రైనేజీలపై శ్లాబులు వేసే సమయంలో లోపల ఉన్న రాళ్లు, ఇతర వ్యర్థాలను తొలగించక పోతే భవిష్యత్తులో మురుగునీటి పారుదలకు తీవ్ర అవరోధం ఏర్పడుతుందన్నారు. ఈ విషయమై ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కమిషనర్ కోరారు. కమిషనర్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

రసాయనాల పిచికారీలో అప్రమత్తం

- సబ్ డివిజన్ ఏడీఏ బాబూరావు


కరపలో రసాయన మందులు పిచికారీ చేస్తున్న అన్నదాత

కరప: పంట పొలాల్లో తెగుళ్ల నివారణకు రసాయనిక మందులు పిచికారీ చేసేటప్పుడు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకుంటే విష ప్రభావానికి లోనుకాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సబ్ డివిజన్ ఏడీఏ కె.బాబూరావు సూచించారు. ఈ పరిధిలోని పలుగ్రామాల్లో ఆయన ఎంఏఓ ఏవీ రాజేష్, వీఏఏలతో కలసి కరప, పెనుగుదురు, కొరుపల్లి, జెడ్.భావవరం తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు సూచనలిచ్చారు. ప్రస్తుతం వరిపంటకు లద్దెపురుగు కనిపిస్తోందని, కొన్ని ప్రాంతాల్లో జింకుధాతు లోపం ఉందని రైతులు వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి, సూచనల మేరకు పురుగు మందులు పిచికారీ చేయాలన్నారు. పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల విషప్రభావానికి లోనై, అస్వస్థతకు గురవుతున్నారన్నారు. ఒక్కోసారి ప్రాణాపాయస్థితికి చేరుకునే అవకాశం ఉందన్నారు.

తీసుకోవలసిన జాగ్రత్తలు..

- రసాయనిక మందులు పిచికారీ చేసే సమయంలో ముఖాన్ని పూర్తిగా గుడ్డతో కప్పుకుని, కళ్లకు అద్దాలు పెట్టుకోవాలి.
- వదులుగా ఉండే దుస్తులు ధరించాలి.
- పిచికారీ సమయంలో మద్యం, చుట్ట, బీడీ, సిగరెట్ వంటివి తాగరాదన్నారు.
- మధ్యాహ్నం సమయంలో ఎండవేడి ఎక్కువగా ఉన్నప్పుడు పిచికారీ చేయకూడదు.
- గాలివాటుకు ఎదురుగా పిచికారీ చేయకూడదు.
- పురుగు మందులు పిచికారీ చేసిన తర్వాత కాళ్లు, చేతులు సబ్బుతో శుభ్రంగా కుడుక్కోవాలి.
- మందు డబ్బాలు, కవర్లు భూమిలో గొయ్యితీసి, పాతిపెట్టాలి.
- ఎవరైనా మందు ప్రభావానికి లోనై, వాంతులు అయినా, కళ్లు తిరుగుతున్నట్టుగా ఉన్నా వెంటనే వైద్యులను సంప్రదించి, వైద్యసేవలు పొందాలి.

నిర్మాణ రంగం సెస్సు కార్మికులకు వెచ్చించాలి

- ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్
- డివిజన్ స్థాయి మహాసభ


ఏఐటీయూసీ మహాసభలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్

పెద్దాపురం: నిర్మాణ రంగంలో వసూలు చేస్తున్న సెస్సు భవన నిర్మాణ కార్మికులకే వెచ్చించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ డిమాండ్ చేశారు. పెద్దాపురంలో బుధవారం జరిగిన పట్టణ తాపీ పనివారల సంఘ కార్యాలయంలో డివిజన్ స్థాయి ఏఐటీయూసీ మహాసభ జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలోనే సుమారు రూ.6 కోట్ల క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణం మంజూరు చేయాలని ఆయన కోరారు. పరిశ్రమల్లో సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలు అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యంతో పాటు బీమా ఏర్పాటు చేయాలని, అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు తాటిపాక మధు ఏఐటీయూసీ పతాకాన్ని ఆవిష్కరించారు. మహాసభ అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా బత్తుల మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా మంచిన భాస్కరరావు, కసింకోట కిశోర్, గోకాడ బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా పెద్దిరెడ్ల సత్యనారాయణ, కార్యదర్శులుగా పితాని సాయిబాబు, యండమూరి సత్యనారాయణ, బొట్టు త్రిమూర్తులు, కోశాధికారిగా రేఖ రామకృష్ణ ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ అనుబంధ సంస్థల నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అంటే బాలల వేధింపే

- నిషేధ చట్టం అమలుకు చర్యలు
- అధికారులతో ఆర్డీఓ రమణ సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ బీవీ రమణ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): బాల్య వివాహ నిషేధ చట్టం-2006ను పటిష్టంగా అమలు చేసేందుకు వివిధ శాఖల అధికారుల సమన్వయంతో పనిచేయాలని ఆర్డీఓ బీవీ రమణ అన్నారు. కలెక్టరేట్ విధాన గౌతమి సమావేశ మందిరంలో బుధవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, చిన్నారులపై లైంగిక దాడులు, చైల్డ్ బెగ్గింగ్‌తో పాటు పలు అంశాలపై డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. చట్టం అమలుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులు , సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రధానంగా బ్లాక్ స్పాట్స్‌పై దృష్టి సారించాలన్నారు. బాల్య వివాహ నిషేధ చట్టం పరిధిలో ఉల్లంఘనలకు కఠిన చర్యలు ఉంటాయన్నారు. బాల్య వివాహాలపై 1098 (చైల్డ్ హెల్ప్‌లైన్), 100 (పోలీస్)కు ఫోన్ చేసి సమాచారమివ్వాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ఉపయోగించుకుని జన జాగృతి, ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తూ బాల్య వివాహాలు జరగకుండా చూడాలని సూచించారు. అనంతరం 'బాల్య వివాహం అంటే బాలల వేధింపే' శీర్షికతో రూపొందించిన పోస్టర్లును ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎస్‌సీపీసీఆర్ సభ్యురాలు టి ఆదిలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీసీఎల్ఎస్ ప్రారంభం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని స్కిల్ ల్యాబ్‌లో బేసిక్ కార్డియో లైఫ్ సపోర్టు(బీసీఎల్ఎస్) శిక్షణ ప్రారంభమైంది. ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం విద్యార్థుల కోసం నిర్దేశించి ఈ కార్యక్రమాన్ని రంగరాయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసీ వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ విష్ణువర్ధన్, డాక్టర్ దేవీ మాధవి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పర్వీన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జలజ ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఉప్పుటేరులో యువకుడి గల్లంతు

కాకినాడ క్రైం: మద్యం మత్తులో ఉప్పుటేరులోకి దూకిన ఓ యువకుడు గల్లంతయ్యాడు. కాకినాడ శాంతినగర్‌కు చెందిన పెద్దాడ ప్రవీణ్ కుమార్ అనే 21 ఏళ్ల యువకుడు బుధవారం ఉప్పుటేరులోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఫైర్ సిబ్బంది గాలించినా జాడ తెలియరాలేదు. అదే సమయంలో అక్కడికి సమీపంలో బోటు వ్యర్థాలకు నిప్పంటుకోగా సాలిపేట ఫైర్ స్టేషన్ సిబ్బంది ఎస్ఎఫ్‌వో ఏసుబాబు ఆధ్వర్యంలో మంటలను అదుపుచేశారు.

పోలియో ఫండ్‌కు చిన్నారుల విరాళం


పోలియోఫండ్‌కు విరాళం అందిస్తున్న విద్యాంజలి ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులు

బోట్‌క్లబ్: పోలియో నిర్మూలనకు అంతర్జాతీయ రోటరీ చేస్తున్న కృషికి అవసరమైన నిధుల సమీకరణ విషయంలో స్థానిక విద్యాంజలి పాఠశాల విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. రోటరీ గోల్డెన్‌జూబ్లీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న విద్యాంజలి ఇంటరాక్ట్ క్లబ్ సభ్యులు పరస్పరం నిధుల సమీకరించుకోవడమే కాక పల్స్ పోలియో ఫండ్‌కు రూ.5 వేలను ఎంపీ వంగా గీత చేతుల మీదుగా బుధవారం అందించారు. ఎంపీ మాట్లాడుతూ రోటరీ క్లబ్ సేవా కార్యక్రమాల ద్వారా అనేక మంది లబ్ధి పొందుతున్నారన్నారు. తనకు గత మూడు దశాబ్దాలుగా రోటరీతో అనుబంధం ఉందన్నారు. పోలియో వంటి మహమ్మారిని రూపుమాపడానికి వారు చేస్తున్న విశేషకృషి వల్ల ప్రపంచంలో ఆ సమస్య కనుమరుగైందన్నారు. అయితే ఇటీవల కొన్న దేశాల్లో తిరిగి ఆ లక్షణాలు కన్పించడంతో అంతర్జాతీయ రోటరీ అప్రమత్తమైందన్నారు. వాటికి అవసరమైన విరాళాలు ఆయా క్లబ్‌లు సేకరించడమనే మంచి లక్షణాలు చిన్న పిల్లలు కూడా అలవర్చుకోవడం గొప్ప విషయమన్నారు. విద్యాంజలి విద్యాసంస్థ కార్యదర్శి వి. సంధ్య నేతృత్వంలో విద్యార్థుల సేవా కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమన్నారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ అధ్యక్షులు జీవీ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ విద్యాంజలి పాఠశాల చిన్నారుల సేవా భావంతోపాటు దాతృత్వంతో సహకరించుకోవడం గొప్ప విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

గేట్ దాటకుండానే టోల్ బాదుడు

- ఇంటి దగ్గర కారు ఉండగానే అకౌంట్ నుంచి టోల్ ఫీజు కట్

పిఠాపురం: కారు టోల్ గేటు దాటకుండానే టోల్ ఫీజు కట్ అవుతున్న ఉదంతాలు 216 జాతీయ రహదారిలో గొల్లప్రోలు టోల్ ప్లాజాలో చోటుచేసుకుంటున్నాయి. తమ కార్లు ఇంటి వద్ద ఉండగానే టోల్ ఫీజు కట్ అయినట్లు మెసేజ్‌లు వస్తుండడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. తన కారు ఇంటి వద్ద షెడ్‌లో ఉండగా కారు టోల్ గేటు దాటినట్టు భావించి టోల్ ఫీజు తన బ్యాంకు అకౌంట్ నుంచి కట్ అయినట్లు పిఠాపురానికి చెందిన వ్యాపార వేత్త కొత్త జగదీష్ బుధవారం ఫాస్టాగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు టోల్ ప్లాజాలో సీసీ పుటేజీలు పరిశీలించగా కారు రాలేదని నిర్ధారించారు. గతంలోనూ ఇలాగే మూడు సార్లు డబ్బులు కట్ అవ్వడంతో పాటు తన మిత్రులకు ఇలాగే జరుగుతోందని ఆయన ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన ఫాస్టాగ్ అధికారులను కోరారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లకు సూచనలిస్తున్న ఎస్సై గరగారావు

సామర్లకోట: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రికార్డులు కలిగి ఉండాలని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. బుధవారం స్థానిక స్టేషన్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. పోలీసు రింగ్ సెంటర్ నుంచి రైల్వే ఇన్‌గేట్ వరకు ఆటోల రాక పోకల నిషేధం గతం నుంచి అమలులో ఉందని, దానిని ప్రతి ఆటో డ్రైవర్ తప్పని సరిగా పాటించాలన్నారు. నిబంధనలు మీరితే అపరాధ రుసుం తప్పదని అన్నారు. ఇప్పటికే అపరాధ రుసుం పడిన ఆటో డ్రైవర్లు దానిని చెల్లించాలని సూచించారు. ప్రతి ఆటో డ్రైవరు ఖాకీ యూనిఫాం ధరించ దంతో పాటు ఆటో లోపలి భాగంలో కూడా ప్రయాణికులకు కనిపించే విధంగా ఆటో నెంబరు ఏర్పాటు చేయాలని సూచించారు.

కోదండ రాముని విగ్రహ ప్రతిష్ఠ


శ్రీరంగనాయకపురంలో సీతా రామచంద్రమూర్తి, లక్ష్మణస్వామి, ఆంజనేయుని విగ్రహాలు

తాళ్లరేవు: తాళ్లరేవు శివారు శ్రీరంగనాయకపురంలోని కోదండ రామాలయంలో ఉదయం సీతా పరివార సమేత శ్రీరామచంద్రమూర్తి, గణపతి, సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఉదయం 8.30 గంటలకు ఏకశిలా ధ్వజ స్తంభాన్ని క్రేన్ సహాయంతో ప్రతిష్ఠించారు. తొలుత స్వామివారి దర్శనం గోవుకు చేయించి, అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేద పండితుడు వెంకటేశ్వరశర్మ నేతృత్వంలో పూజలు జరిగాయి. ఆలయ నిర్మాణకర్త మంతెన భువనేశ్వరీవర్మ ఆధ్వర్యంలో ఐదుగురు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం జరిగింది. మాజీ ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, ఎంపీపీ రాయుడు సునీత తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అపర్ణాదేవి గ్రామోత్సవం


తాటిపర్తిలో అపర్ణాదేవి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో వేంచేసిన అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి కల్యాణోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత నాలుగు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తొలి రోజు అపర్ణా సమేత నాగేశ్వరస్వామివారి దివ్య కల్యాణం కనుల పండువగా నిర్వహించగా నాల్గో రోజు బుధవారం ఆలయ అర్చకులు ఆకొండి వెంకటేశ్వరశర్మ, ఆకొండి ప్రభాకర శాస్త్రి స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి దివ్య కల్యాణోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ భక్తులను అమితంగా ఆకట్టుకుంటోంది.

ఎస్సైగా గోపాలకృష్ణ బాధ్యతల స్వీకరణ

సామర్లకోట: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్సైగా సీహెచ్ గోపాలకృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు ఆదేశాల మేరకు తుని ఎస్సై గోపాలకృష్ణను సామర్లకోట స్టేషన్‌కు నియమించారు. దాంతో ఆయన స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామ భీమేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసి బాధ్యతలు స్వీకరించారు. సామర్లకోట పోలీసు స్టేషన్ సర్కిల్ కావడంతో ఇప్పటికే టి.సునీత స్టేషన్ ఎస్సైగాను, అడపా గరగారావు ట్రాఫిక్ ఎస్సైగాను పని చేస్తున్నారు. గోపాలకృష్ణ పోలీసు స్టేషన్ ఎస్సైగా ప్రధాన బాధ్యతలు స్వీకరిస్తారు.